# సాహిత్య కౌముది

అలా దక్షిణపువేపున గోవుల్ని ముట్టడించారని తెలిసి నాన్నగారు సైన్యం సమాయత్తం చేసుకుని వెళ్లారు. నగరంలో యోధుడనే ప్రతివాడూ వారివెంటే వెళ్ళటం మూలాన ఊసుపోక అంతఃపురానికి వెళ్ళి కూర్చున్నాను. అక్కడి స్త్రీ జనమంతా యీ పోరాటాన్ని గురించి కన్నులు యింతింతలు చేసుకుని గుసగుసలు చెప్పుకొంటున్నారు.

నాకు నవ్వువచ్చినది. ఈ ఆడవారు ఎంతముగ్ధలు! యుద్ధభూమి ఎలా వుంటుందో, యుద్ధరంగం ఎంత భీకరమైనదో - వీళ్లు ఊహించనైనా లేరు. ఒకవేళ అట్టి భయంకర రణరంగం చూడటం తటస్థించినా-వీళ్లు వరసలుపెట్టి మూర్ఛలు పోతారు!

ఇంతలో-ఉత్తరపు వేపున మేస్తూవున్న గోవుల్ని కూడా కౌరవసైన్యాలు ముట్టడించాయని పిడుగులాంటివార్త వచ్చింది వార్త వింటూనే - అంతఃపుర కాంతల ముఖాలు వెలాతెలాపోయినవి. నాకు మహా పౌరుషము వచ్చినది.

ఈ కౌరవుల ఆగడము ఏమి చూచుకొని! విరాటమహారాజు కుమారుడూ, మహావీరుడూ అయిన ఉత్తర కుమారుడు నగరంలో ఉండగానే? క్షణంలో వీరినీ, వీరిసైన్యాన్ని అల్లకల్లోలం చేసి పరిమార్చివేయాలె!

అప్పటికే నా మనస్సులో ఒక దృఢనిశ్చయానికి వచ్చినాను. ఆడవారు అప్పుడే కళ్లనీళ్లు పర్యంతమైనారు. వారిని ఓదార్చి - నా అవక్ర పరాక్రమమూ - సంగరభూమికి నేను వెళ్లి దల్చిన వైనమూ వారికి బోధపరచి-సముదాయించుసరికి నా తలప్రాణము తోకకు వచ్చినది.

చటుక్కున నాకు స్ఫురణకువచ్చినది. ఎంతటి సామర్థ్యం ఉండి ఏమి లాభము! నాకు సమయానికి రథసారథి లేడు! సారథి లేని రథముతో రణరంగానికి ఎట్లా వెళ్ళగలను? సుశిక్షితులైన సారథులందరూ నాన్నగారిలోనే వెళ్లిఉన్నారు. ప్రవాహమువంటి నా ఉత్సాహ సంరంభమంతా ఒక్కసారి అణగారి పోయినట్లయినది. ఏమీ మార్గాంతరము తోచక అట్టె కూర్చుండిపోయినాను.

విషయము తెలిసి అంతఃపురజనము స్థాణువులై నిలబడినారు. వారుమాత్ర మేమి చేయగలరు? అపరాహ్ణ మవుతున్నది. ఈ అబలలమధ్య నేనూ చేతగానివానివలె ఎంతసేపు కూర్చుండవలెనో నాకు తోచలేదు.

ఇంతలో ఏదో సంరంభముతో ఉత్తర నా కడకు పరుగిడివచ్చినది. ఆమె నాకు చిన్నారిచెల్లెలు ఆమె నా ప్రాణమునకు ప్రాణము. తరగలవలె తళతళలాడు కన్నులు అల్లలనార్చుతూ ఉత్తర నా చెవిలో యేమేమో చెప్పినది.

ఆ బాలిక అమాయికతకు పక పక నవ్వినాను. తన నాట్యాచార్యునిపైన తనకు అభిమానం ఉండవచ్చుగాక! అతడు నాసారథి ఏమిటి? ఇది మాదాసి సైరంధ్రితలలో మొలకెత్తిన ఆలోచన అట! ఆమె ఆ మొలకను పదిలముగా తెచ్చి యీ మెగారి మెదడులో నాటినది. ఇంకేమి, యీ పిచ్చిబాలిక

## పురాణగాథ

యింతటి సాయము నాకు చేయవలెనని పరుగెత్తుకవచ్చినది! అహో, ఆడవారి మేధాసంపత్తి!

ఉత్తర నా సమాధానము విని చిన్నబుచ్చుకుని వెళ్లినది. వెళ్లినది వెళ్ళినట్లుండవచ్చునా-మరికొంతసేపటికి ఆ సైరంధ్రి నే వెంటపెట్టుకుని చక్కావచ్చినది. తనకు తోడు కాబోలును! వెఱ్ఱిబాగుల ఉత్తర!

ఆ వచ్చిన సైరంధ్రిముందర నేనే మాట్లాడలేకపోయినాను. అన్ని ఆక్షేపణలనూ చిత్రంగా ఖండించివేసి - ఆ నాట్యమూ, సంగీతమూ నేర్పుకునే ఆచార్యుని - సమర్థించి ఒక మహాయోధునిగా చిత్రించి వేసింది! ఆమె వాక్చాతుర్యానికి నిశ్చేష్టుడనైన నాకు నోట మాటరాలేదు!

ఆ బృహన్నల ఒక నివురు గప్పిన నిప్పట. ఖాండవదహన సమయంలో అర్జునునికి రథసారథిగా వుండి అతని విజయానికి కారకుడైనాట! ధర్మజుని కొలువులో తాను ఉండగా కన్నులార యీ విషయము చూచినదట! అర్జునునికి మహాప్రీతిపాత్రుడైనసారథి బృహన్నల అట! భగవంతుడిచ్చిన ఆకారానికి అతడేమి చేయగలడు? రణరంగంలో అక్కరకు వచ్చేది చాక చక్యమూ, నిపుణతా కాని - రూపురేఖావిలాసము కాదుకదా! .. సైరంధ్రి బృహన్నల తరఫున న్యాయవాదివలె వాదించినది.

నాకున్నూ గత్యంతరము తోచలేదు. సైరంధ్రి మాటలు నాకు విశ్వసనీయములుగా తోచనప్పటికీ-ఆ బృహన్నలనే రథసారథిగా అంగీకరించక తప్పలేదు! కాలవైపరీత్యం! గునుస్తూనే ఆ నాట్యాచార్యునికి కోసం కబురుపెట్టినాను.

అతనిది పురుషోచితమైన నడక కాదు. ఆడపిల్లవలెనె మహాసిగ్గుపడుతూ, ప్రతి అడుగులో తాళగతులు ప్రదర్శిస్తూ, వచ్చి నమస్కరించినాడు. ఇతడా రథసారథి! యుద్ధరంగంలోనూ ఇలాగే శత్రుసైన్యాలనుచూచి సిగ్గుపడడా?

నాట్యమూ, సంగీతమూ చెప్పుకొనుట యందు తాను ప్రవీణుడే కానీ - యుద్ధరంగంలో రథసారథ్యము చేయగల స్థైర్యము తనలో లేదని కొంతసేపు కసిగినాడు. కాని-తానేమో మహావీరుడైనట్లు నేను మరీ మరీ పొగడగా - తలవంచి సమ్మతించినట్లు తల ఊపినాడు.

ఆఖరుకు శిరస్త్రాణమూ, శరీర కవచమూ, తొడుగుకోవటం కూడా ఆ బృహన్నలకు చాతకాలేదు! అంతఃపురస్త్రీలలో ఒకటే నవ్వుల గలగలలు!

పొర్లివస్తున్న చిడిముడిపాటును నాలోనే అణుచుకొని నేనే ఆ మూర్తీభవించిన వీరత్వానికి కవచాదులు తొడిగినాను - ఉత్తర మాకు హారతి యిచ్చినది. చిరునగవుతో మమ్ము సాగనంపిన ఉత్తరముఖము నాకు ఎదురు రాగల విజయలక్ష్మివలె గోచరించినది.

ఆమె శుద్ధబాలిక! శత్రువుల శిరోవేష్టనములలో రంగురంగుల వస్త్రములు బొమ్మపాత్రికలకై తనకు కావలెనట. అడెంతటి

పని! నవ్వుతూ ఉత్తర భుజముపై ఒక్క చరపు చరచి రథ మధిరోహించినాను.

*          *          *

బారులు తీర్చిఉన్న కురుసైన్యము చూచీ చూచుటతోడనే నాలో ఏదో కంపము సాగినది. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, కర్ణుడు, దుర్యోధనుడు—వీరందరూ యోధులుగాగల మహాసైన్యమెక్కడ? అర్భకుడను, ఒంటరిని–నేనెక్కడ! తలచిన కొలది నన్ను భయము—తొట్రుపాటు—ముంచెత్తినవి.

మెల్లగా బృహన్నలను బ్రతిమాలినాను-రథము వెనుకకు మరలించమని, బలాబలాలు యింతటి వ్యత్యస్తముగా వున్నప్పుడు, మూర్ఖించి ముందుకు వెళ్లటం-బుద్ధిమంతుల పనికాదని చేతులుపట్టుకొని వేడుకొన్నాను.

బృహన్నలలో కొంత మూర్ఖత్వముకూడ ఉన్నదేమో-నామాటలు పెడచెవిని పెట్టి రథము ముందుకే సాగనిస్తున్నాడు. నాకు శ్రీరంగనీతులున్నూ వల్లిస్తున్నాడు. యుద్ధభూమికవచ్చి వెనుకకు మరలిపోవటం వీరోచిత లక్షణంకాదట! ఈ సమరనీతులు ఎవరు ఎరుగరు? అక్కడకు తానొక మహావీరుడైనట్లు! అంతఃపురంలో ప్రగల్భంపలికి వచ్చి విజయలక్ష్మి లేకుండానే తిరిగి వెళితే-స్త్రీజనము మధ్య హాస్యాస్పదుడనౌతానట! స్త్రీజనముమధ్య గౌరవముకంటే ప్రాణములు ఎక్కువని-యీ వెఱ్ఱి బృహన్నల ఎరుగడు!

అరదము కురుసైన్యానికి మరీదగ్గరగా చేర బోతున్నది నాకు ముచ్చెమటలు పోసినవి. అనుకోకుండా క్రిందకు లంఘించి శక్తికొలదీ ఒకటే పరుగు తీసినాను.

ఈ బృహన్నల మహా అసాధ్యుడు! రథము ఆపి త్రుటిలో తానూ నా వెనకనే పరుగిడివచ్చి జలగవలె నన్ను పట్టుకొన్నాడు! ఆ పరుగులో వేగమే కాని - భరతనాట్యాల



# ★ స్వోత్కర్ష కాదు... ★

కొదువులు లేవు అతని ముఖములో - ఏదో దృఢతర శౌర్యదీక్షే కాని - అతనికి అలవాటయిన స్త్రీత్వపు హొయలు లేవు!

నన్ను బాలకునివలె ఎత్తితెచ్చి రథముపై కూర్చుండబెట్టి బృహన్నల అన్నాడు అశేషంగా, మహా బలసంపన్నంగావున్న కురు సైన్యాన్ని తానొక్కడే ఓడించి గోవులను సంరక్షించి తెస్తాడట! కాని నేను తనకు సారథిని కావలెనట! ఎంతటి విచిత్రము! ఉత్తరకు నాట్యగురువు కౌరవ సైన్యాన్ని జయించటమా! నేనాతనికి రథసారథినిగా ఉండవలెనా! నాలో బృహన్నల పై కోపము, విసుగు—ఆవిరులై వచ్చినవి.

కాని చేయగలది లేదు ఈబృహన్నల పట్టిన పట్టు విడవడు. ఈ దినముతో నా జీవితము అంతమౌతున్నదని గుండె రాయి చేసుకుని- ఒక్క నిట్టూర్పువిడిచి అశ్వాల పగ్గాలు పట్టుకున్నాను

దాపున ఉన్న శమీ వృక్షము దగ్గర రథము ఆపి నన్ను పైకి యెక్కి అర్జునుని విల్లు-గాండీవము తెమ్మని బృహన్నల ఆజ్ఞాపించినాడు. అది విల్లు కాదు - ఏదో శవము వలె వున్నది. రాచబిడ్డను - వృక్షారోహణము చేయమనీ, ప్రేతమును స్పృశించుమనీ, నన్ను ఆజ్ఞాపించుటకు యీ బృహన్నలకు హక్కేమున్నది? రోషంతో, నాతనువంతా ఉడికిపోతుండగా, ఆ పని నేను చేయజాలనని బృహన్నలతో నిక్కచ్చిగా చెప్పివేసినాను.

బృహన్నల యమకింకరుడు! అది శవము కాదనీ, పాండవులు అజ్ఞాతవాసానికి వెడుతూ తమ అస్త్రాలన్నీ కట్టుదిట్టము చేసి ఆశమీ వృక్షము మీద దాచినారనీ, నాకు అరగడియ ఉపన్యాసమిచ్చినాడు

ఈ శమీ వృక్షమూ, ఈ ఆయుధాల దాపరికమూ, యీ బృహన్నలకు ఎలా తెలుసును? ఏయే ఆయుధము ఎవరిదైనదీ, వాటి పేర్లతోసహా బృహన్నల నాకు తెల్పినాడు. విస్తుపోతూ, బృహన్నల వంకే చూస్తూ ప్రాన్పడి నుంచున్నాను

పాండవులు నాకు ప్రీతి గూర్చిన మేనమామలు వారిపైన నాకు మహా భక్తి, గౌరవాలున్నూ! వారిప్పుడు ఎక్కడ ఉన్నట్లూ? వారిని గురించిన యిన్నికబుర్లు చెప్పిన బృహన్నలనే అడిగాను.

అతగాడు అదేపనిగా నవ్వుతూ మెల్లమెల్లగా అందరి ఉనికీ బయటపెట్టినాడు. వింటూనే నా హృదయము గతులు తప్పినట్లై కన్నులు వప్పజెప్పి నిరుత్తరుడనై నుంచున్నాను

పాండవులు ఏడాదినుంచీ మా ఆస్థానములోనే మేమెరుగకుండా తలలు దాచుకొన్నారు! దాసి సైరంధ్రి మాఅత్త ద్రౌపదీదేవి! భీమసేనుడా మా వంటలవాడు వలలుడట! ధర్మసుతుడు కంకుభట్టున్నూ, అశ్వశిక్షక గోపాలకులు నకుల సహదేవులున్నూ- అని ఊహించటానికి కూడా నా మనసు వప్పలేదు

ఇక, ముసి ముసి నవ్వులు నవ్వుతూ తానే అర్జునుడనని బృహన్నల తెలుపుకొన్నప్పుడు నాగుండె క్షణమాత్రము స్పందించనేలేదు!

అలా ఆయనవంక రెప్ప వేయకుండా చూస్తూనే వున్నాను. బృహన్నల విచిత్రంగా మారిపోయినాడు! ఆయన సంకల్ప బలము ఎట్టిదోకాని, ఉష్ణీషమూ, రత్నకుండలాలూ, మణిమయ కిరీటమూ, శ్వేతాంబరాలూ క్షణంలో తమంతట తామే వచ్చి ఆయనను అలంకరించుకొన్నవి! ఇక బృహన్నల ముఖంలో నెరిగిన లాలిత్యమూ,

(49-వ పేజీ చూడండి)



ఇచ్చుట తగదు. అంతేకాదు. పరమ దరిద్రుడనైన నాకు అంగీకరించుటకు సమ్మతముగాకున్నది. దాని వలన నా దారిద్ర్యము మరింత ఎక్కువ అగునని భయముకలుగుచున్నది" అని వినయపూర్వకముగా పలికెను.

అనవేమారెడ్డి మారుమాటాడక ఆ కవిచంద్రునికి పదివేల బంగారు నాణెములు, విలువైన చీనిచీనాంబరములు, అనేక మణిమయాభరణములు ఇచ్చి మిక్కిలి సత్కారము చేసెను. కొలువులోనివారు కవి చమత్కారమును మిక్కిలి కొనియాడిరి. నాటినుండి కవి దారిద్ర్య బాధ తొలగిపోయెను, అనవేమారెడ్డి దానపరత్వము చరిత్రలో నిలచిపోయెను. ★

(శ్రీనాథుని గూర్చిన చాటువులు ఆధారం)

## సెట్టి శకునం

(47-వ పేజీ తరువాయి)

చంకలలోని రెండు పిల్లిపిల్లల్ని చూపించేసరికి రెండూ ఒక్కసారి గోపాలాచార్యులు చంకల్లోనించి "మ్యావ్' మన్నాయి. ఇంక సెట్టి వుండలేకపోయి, "ఆచార్యులు! యీ సెట్టిప్రాణానికి నీవొక్కడవు చాలవు? నీతోడు ఆ రెండు పిల్లులు కూడా ఎందుకూ! నాదేం అంతగట్టి ప్రాణమా?" అని అనేసి యింట్లోకి పోయి, తలుపేసుకు పడుకున్నాడు. రాత్రి నిద్దర్లేదేమో కొంచెం పొద్దెక్కేవరకు లేవలేకపోయాడు. నిద్ర మొహంనుంచే మంచానికి ఇరుప్రక్కల ఇద్దరు పోలీసులు సిద్ధం! గురువారం, గోపిసెట్టి కోర్టుకు హాజరు కాకపోవుటచేత, కోర్టుధిక్కరణ నేరంతో, పోలీసులు కోర్టుకు హాజరు పెట్టడానికి సిద్ధమయ్యారు. పోతేపోయింది, ఈ పోలీసువాళ్లతో పోతేనే నయం! లేకపోతే ప్రాణానికే ముప్పులావుందని కోర్టుకు హాజరైనాడు. కేసుకు రెండు నెలలు, కోర్టుకు రానందుకు ఒక్కనెల శిక్షపడింది సెట్టికి. శకున ఫలితం పూరికే పోతుందా? అందుకే 'మనవాళ్లు మంచిశకునం చూసుకొని బయలుదేర మన్నారు. ★

## ప్రేమలేఖ పర్యవసానం

(10-వ పేజీ తరువాయి)

గలమా. ?

ఎందుకు ప్రయత్నించడం.. ?

నీ కళ్లలో, పెదవుల్లో, ముక్కు కొనలో, అంతటా శిల్పాన్ని చూచి, ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ, ఈ ప్రపంచంతో, ప్రకృతితో కట్లు తెంపుకొని, విడని కౌగలితో తేలిపోదామనుకున్న క్షణం కదూ. !! వెదుతున్నాగార్దెనుకు.., ఆ క్షణం తల్చుకుంటే నా హృదయమాగదంలేదు. నేనిక వ్రాయలేను. వెదుతున్నా, మావిడాకులనీడలుపడే, ఆ తెల్లయిసుకమీద నీ గుర్తులేమైనా వుంటాయేమో..,

ఆ సరస్సులో నీ ప్రతిబింబం కనబడుతుందేమో .!,

ఆశగా వెదుతున్నాను.

నీ,

.......... ..........

"బాగుందా జానకీ! దాన్ని పత్రికలో లేఖల పోటీకి పంపిద్దామను కొంటున్నాను." కుర్చీలా కూర్చొని లేఖ చదువుతున్న జానకితో అప్పుడే ఆఫీసునుండి వచ్చి, టై ఊడదీస్తున్న కృష్ణమూర్తి అన్నాడు.

అనుమానంతో మలినమైన అర్ధాంగి జానకి హృదయం, అనురాగంతో నిండి, ఒక నిట్టూర్పు విడిచింది. ★

## ప్రోత్సాహ కాదు...

(8-వ పేజీ తరువాయి)

ఆడంగితనమూ మాయమై, మహాపురుషులకు మాత్రమే ఉచితమైన తేజస్స్ఫూర్తి-రాజ శివి వెలకొన్నవి.

బృహన్నల - ఊహు - అర్జునుడు రథం అధిరోహించి, గాండీవం యెక్కుపెట్టి ఒక్కసారి శింజినీ టంకారం చేసినాడు. ఆ ధ్వనికి దిక్కులు దద్దరిల్లటమే కాకుండా స్వయంగా నేనే మూర్ఛపోయినాను!

మూర్ఛనుండి తేరుకొని మెల్లగా లేచి అర్జునునికి భక్తి గౌరవాలతో వంగి నమస్కరించినాను.

ఆయన నాగుబాముపలె శత్రుసేనలోనికి చొచ్చుకొనిపోయినాడు.

ప్రోత్సాహ కాదుగాని, నేనెంతటి అదృష్టవంతుడను కాకపోతే - అంతటి మహావీరునికి సాక్షాత్తు ఇంద్రసుతుడైన అర్జునునికి సారథిని కాగలిగిన ధన్యత నాకు కలుగుతుంది! నేనే పాటి వీరుడను! స్వయంగా విల్లుపట్టి యుద్ధం చేయకపోయినా, ఆ మహాసేనామధ్యంలో పగ్గాలు చేతబట్టి-ఆ ప్రచండయోధుని భావము కనిపెట్టి - చిత్రవిచిత్రగతులలో అశ్వములను నడిపించుటకు కూడ ఎంతటి మనస్థైర్యము - నేర్పరితనము కావలె మరి! ★

కొక్కోకశాస్త్రము - పుస్తకం రు. 5/-
మీ అభిమానసినీతారలు, నాయకులు, దేవుళ్లు.
20 ఫొటోలు రు 2/- 100 ఫొటోలు రు. 8/-
PARADISE AGENCY, Choolai, Madras.

## బుడుగు టపా

(5-వ పేజీ తరువాయి)

తప్పకుండా వస్తావుకదూ ?

దంతుర్తి సుజాత (హైదరాబ్బాద్)

నేనైతే ఒక్కడూ రావచ్చుకాని, బాబాయిని రానీదుగదా బామ్మ. అది వస్తానూ అంటుంది వాడితో. బామ్మ వస్తే నాన్నని సాయం రమ్మంటుంది. అప్పుడేమో అమ్మ నేనూ వస్తానూ అంటుంది. అప్పుడేమో రైల్లో అందరికీ ప్రెవేటు చెప్పడానికి (లాపోతే చోటు యివ్వరుగా) లావుపాటి పక్కింటి పిన్నిగారుని పట్టావాలిగదా. అప్పుడదేమో వుకేయి లావుపాటి పిన్నిగారు ముగుడూ నువ్వొక్కడూ ఇక్కడెందుకూ, మరేమోనూ నాతో వచ్చెయి సుజాతావాళ్లు పిల్చారూ దామ్మాబా, అని వాణ్ణి రైల్లో పెళేస్తుంది. అప్పుడు మేం అగ్గంధరం వచేస్తే మీ బామ మా బామ్మ కలిసి నాకు ప్రెవేటు చెప్పేస్తారుగదా. కాని ఓటి బేధ్ధ్రాబంఉంది. మేం అంంం ధరం వసే మళ్ళి మళ్లో తియ్యక్కర్లేదు మీ ఊళ్లో. ఇందాకళ మళ్లోలాగే మీ యింట్లో మేం కూచుంటాంగా. అప్పుడు లావు పాటి పక్కింటి పిన్నిగారు బోల్డు చోటు లాక్కుంటుందనుకో. అప్పుడు బాబాయి తలకాయి ఎగ్గిరి పోతుంది. అప్పుడు బాబాయికి కోపంవచ్చి నన్ను ఎందుకురా పిలిచావు అంటాడు. ఎలా. ఎలా అంటే ఏం చెప్పానో నాకే తెలీటంలేదు అదీ సంగతి. ఈ రాసిపెట్టుతున్న వాడు మళ్లీ చదవమన్నా చదవడు. ★